క్లుప్తంగా

మ్యూజియంకు వాటర్ కూలర్ బహూకరణ


వాటర్ కూలర్ బహూకరిస్తున్న శేషకుమారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పురావస్తు ప్రదర్శన శాల (మ్యూజియం) ఏర్పాటుతో ఏలూరు ప్రాంతానికి చారిత్రాత్మకంగా ఉన్న గొప్పదనం తెలిసిందని ఏలూరుకు చెందిన ప్రస్తుతం సింగపూర్‌లో ఉంటున్న యడవల్లి వెంకటరామ శ్రీనివాస్, శేషకుమారి దంపతులు అన్నారు. సందర్శకుల సౌకర్యార్థం వారు వాటర్ కూలర్/డిస్పెన్సర్‌ను మ్యూజియంకు బహూకరించారు. సింగపూర్ నుంచి వచ్చిన వారు నగరంలో ఆర్కియాలజీ మ్యూజియంను సందర్శించారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): దెందులూరు మండలం ముప్పవరం గ్రామంలో ఉపాధి హామీ పనులు చట్ట వ్యతిరేక పనులు చేయిస్తున్న దెందులూరు ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్య తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ముప్పవరం సర్పంచ్ మెండెం సంతోష్ కుమార్ డ్వామా అధికారులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం లేకుండా రిజల్యూషన్ ఇవ్వకుండా మండల అభివృద్ధి అధికారి ఎలా వర్కు ఆర్డర్ ఇచ్చి పనులు చేయిస్తున్నారంటూ ప్రశ్నించారు. గ్రామ సర్పంచ్‌కి తెలియజేయకుండా, ఎంపీడీఓ, ఏపీఓలు చట్టాలకు, సెక్షన్లకు వ్యతిరేకంగా పనిచేస్తూ గ్రామస్తుల మధ్య గొడవలు సృష్టిస్తూ, గ్రామ పంచాయతీల పతనానికి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరులోని డ్వామా కార్యాలయంలో ఏపీఓ కె.పురుషోత్తం, ఏఓ విజయకుమార్‌లకు ఆయన వినతి పత్రం అందజేశారు.

16, 17 తేదీల్లో క్రిస్మస్ ఆరాధన పండుగలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మన్నా చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో క్రిస్మస్ ఆరాధన పండుగలు నిర్వహించనున్నట్టు పాస్టర్ ఎం జ్యోతిరాజు తెలిపారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని సెయింట్ గ్జేవియర్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించే ఈ పండుగల్లో వేలాది మంది దైవజనులు, విశ్వాసులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రముఖ టీవీ వర్తమానికుడు జాన్ వెస్లీ ఈ నెల 17న ఆధ్యాత్మిక సందేశం ఇస్తారని, నగర ప్రజలు సంతోషంగా జీవించాలని కాంక్షిస్తూ ఈ నెల 15న క్రిస్టమస్ సువార్త ర్యాలీ ఉంటుందని వివరించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పోస్టర్ విడుదల చేశారు.

వినియోగదారుల ఉద్యమం బలోపేతం కావాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో వినియోగదారుల ఉద్యమం బలోపేతం కావాలని కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్స్ అసోసియేషన్ (సెడ్కాస్) కన్వీనర్, న్యాయవాది కట్టా సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఆర్ పేటలో శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల సంఘాల ప్ర తినిధుల సమావేశంలో సత్యనారాయణ మా ట్లాడారు. ప్రతి గ్రామం, మండలం, నగరాల లో పౌరులు వినియోగదారుల సంఘాలుగా ఏర్పడి ఆహార పదార్థాలు కల్తీలని, తూనికలు కొలతల మోసాలను ప్రశ్నించాలన్నారు. వినియోగదారుల ఉద్యమ నాయకులు కో కన్వీనర్ సుబ్రహ్మణ్యం, కో కన్వీనర్, న్యాయవాది సీపీఎస్ రామానుజాచార్యులు, కో కన్వీనర్స్ బంగారురాజు, రిటైర్డ్ హెడ్మాస్టర్ డి.కస్తూరి, వి.రామచంద్రమూర్తి, న్యాయవాది పి.పరమేశ్వరరావు న్యాయవాది శ్రీనివాసరావు, న్యాయవాది పి.శిరీష మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నవల్లివారిపేట, లంబాడీపేట, అగ్రహారం, పెరుగుచెట్టు ప్రాంతం, భర్తియా కళ్యాణ మండపాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

క్రైస్తవ ప్రచారాన్ని అడ్డుకోవాలంటూ వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లో క్రైస్తవ మత ప్రచారాలను అడ్డుకోవాలని కోరుతూ హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు శుక్రవారం నగరంలోని వివిధ జిల్లా ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో క్రైస్తవ మత ప్రచారం చేయడం, క్రిస్మస్ పేరుతో, కూటముల పేరుతో మత మార్పిడులకు పాల్పడటం చట్ట ప్రకారం అడ్డుకోవాలని కోరారు.

హోరెత్తిన రైతు పోరు

- ఏలూరు నగరంలో వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ
- కదంతొక్కిన పార్టీ శ్రేణులు


రైతు పోరుబాటలో మహిళా నాయకులు


ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో దివంగత మహానేత వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఏలూరు సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: రైతన్నలను అత్యంత దారుణంగా మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ పోరాటం ప్రారంభించింది. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఎన్నికల హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇక ప్రజల్లోనే ఉంటూ పోరాటానికి సన్నద్ధమైంది. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వరి కంకిలతో, ప్లకార్డులతో ప్రదర్శన చేస్తూ.. రైతన్నలకు న్యాయం చేయాలంటూ నినదిస్తూ నగరంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచీ ఎన్ఆర్‌పేట మీదుగా కోర్టు సెంటర్, కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కొద్దిసేపు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య పాలనపై నినాదాలు చేశారు.

న్యాయవాదుల సంఘీభావం

ఏలూరు నగరంలో వైఎస్సార్ సీపీ చేపట్టిన రైతు పోరు కార్యక్రమానికి న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. లీగల్ సెల్ నాయకులు ప్రత్తిపాటి తంబి ఆధ్వర్యంలో న్యాయవాదులు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. వీరిలో ఏలూరు కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, జిజ్జువరపు విజయనిర్మల, ఇనపనూరి కేదారేశ్వరి, ఇమ్మానుయేల్ జయకర్, తంగెళ్ల రాము, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్, జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, ముఖ్య నాయకులు తోటకూర కిషోర్, ఇనపనూరి జగదీష్, మట్టా రాజు, బండ్లమూడి సునీల్ కుమార్, జనార్ధన్, సత్యదేవ్, గంటా పండు, గంటా రాజేశ్వరరావు, స్టాలిన్, తులసీ వర్మ, తదితరులు ఉన్నారు.

సుద్ద జలాలే దిక్కు

- పట్టాలెక్కని తాగునీటి ప్రాజెక్టు
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రణాళిక
- నేడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం



కొత్తూరుకాలనీ ప్రజలకు నీరు అందిస్తున్న బోరు

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నగర ప్రజల కోసం కోట్ల రూపాయలతో సురక్షిత తాగునీరు ప్రాజెక్టును రూపుదిద్దారు. కార్పొరేషన్ అధికారులు డిటెడ్ ప్రాజెక్టు రిపోర్ట్ అందించినప్పటికీ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఈ ప్రాజెక్టు అమలైతే నగరంలో సుమారు 1.50 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుతుంది. నేటికీ వెంకటాపురంలో 30 వేల మంది సుద్దనీరే తాగుతున్నారు. కొత్తూరు తమ్మిలేరు గట్టు ప్రజలకు నూతి నీరే దిక్కయ్యాయి. శ్రీరామ్‌నగర్, శనివారపుపేట ప్రజలకు నేటికీ బోరు నీరే సరఫరా అవుతోంది.

ఎన్నికల కోడ్‌తో నిలిచిన పథకం

వైఎస్సార్ సీపీ హయాంలో సుమారు రూ.129 కోట్లతో సురక్షిత తాగునీరు ప్రాజెక్టు రూపుదిద్దారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.8.17 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్లనాని సమక్షంలో కార్పొరేషన్ అధికారులు ఈ పథకానికి తుది రూపు ఇచ్చారు. ఇలోగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవడంతో పనుల పట్టాలెక్కలేదు. పనుల ప్రారంభిస్తే 6 ఓవర్ హెడ్ ట్యాంకులు, పోణంగిలో 15 ఎంఎల్‌డీ, 10 ఎంఎల్‌డీ ఇంటర్మీడియ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. దీనికి తోడు ఇప్పటికే నగరంలో ఉన్న పలు ఓవర్ హెడ్ ట్యాంకులకు శుద్ధినీరు పైప్‌లైన్లు అనుసంధానించనున్నారు. ఈ పథకం ప్రణాళికలో భాగంగా పైప్‌లైన్ ఏర్పాటుకు మాదేపల్లి ఇందిరమ్మ కాలనీకి రూ.62 లక్షలు, బూరాయిగూడెంకు రూ.35 లక్షలు, కొమడవోలు 1, 2 వార్డుల్లోని ఇందిరమ్మ కాలనీలకు రూ.25 లక్షలు, శివకామాక్షి కాలనీకి రూ.24 లక్షలు, జయప్రకాష్ నగర్‌కు రూ.32 లక్షలు మంజూరు చేయాలని పేర్కొన్నారు.

నీరు రావడం లేదు



కొన్నేళ్ల క్రితం పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు మా గట్టుపైకి పైప్‌లైన్ వేశారు. చాలా సంతోషించాం. మా కష్టాలు తీరిపోయాయి అనుకున్నాం. తీరా చూస్తే పైప్‌లైన్ మూణ్నాళ్ల ముచ్చటగా మారిపోయింది. ఎగువ ప్రాంతాల్లో మోటార్లు ఉపయోగించడం వల్ల మా వరకు నీరు రావడంలేదు. ఈ నేపథ్యంలో నూతినీరు పట్టుకుంటున్నాం.

– గాయత్రి, వెంకటాపురం

నెలకు రూ.600 ఖర్చు



పోలీస్ కాలనీ గట్టుపై నివసించే వారంతా కాయ, కష్టం చేసుకునే వాళ్లే. అయినప్పటికీ అధికారులు మా మొర ఆలకించడం లేదు. తాగునీటి కోసం రోజుకు రూ.20 చొప్పున నెలకు రూ.600 ఖర్చు చేస్తున్నాం. నూతినీళ్లు తాగితే ఏం జబ్బులు వస్తాయోమోనని భయం. నీరు కొనుక్కుని తాగాల్సి వస్తుంది.

– భవాని, పోలీస్ కాలనీ గట్టు నివాసితురాలు

ఉప్పు, సుద్ద నీరే దిక్కు



కాలనీల్లో వేసిన బోర్లు నుంచి సుద్ద, ఉప్పునీరు వస్తుంది. ఈ నీరు తాగలేకపోతున్నాం. రోజుకు కనీసం రూ.20 నీటి కోసమే ఖర్చు చేస్తున్నాం. సుద్ద, ఉప్పునీరు వంట వండుకోడానికీ పనిచేయడంలేదు. అన్నం వండితే చిమిడిపోతోంది. స్నానం చేద్దామంటే చర్మ వ్యాధులు వస్తాయేమోనని భయం. గోదావరి నీరు సరఫరా చేయాలి.

– విజయమ్మ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీవాసి

నీటి ప్రాజెక్టు అమలు చేయాలి



వైఎస్సార్ సీపీ హయాంలో రూపొందించిన నీటి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ప్రారంభించాలి. లేకపోతే భవిష్‌లో సైతం ఏలూరు ప్రజలు తాగునీరు కోసం నానా అగచాట్లు తప్పవు. ఇప్పటికే సగం ప్రజలు బోరు నీరే తాగుతున్నారు. మరో సగం మంది నీరు కొనుక్కుంటున్నారు. ప్రాజెక్టు ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ముంగర సంజీవ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేత

ప్రమాద ఘటనపై స్పందించిన ఎస్పీ

ఏలూరు టౌన్: జిల్లాలో పోలీస్ సిబ్బంది, అధికారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోన్న ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ మరోసారి సిబ్బందిపై ఉన్న సానుకూల ధృక్పథాన్ని చాటుకున్నారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయ కానిస్టేబుల్ ప్రదీప్ కిరణ్ అతని భార్య కిరణ్మయి మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తుండగా శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సమాచారం అందుకున్న ఎస్పీ శివ కిషోర్ ఆదేశాలతో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ ఘటనా స్థలానికి వెళ్లి కానిస్టేబుల్ ప్రదీప్ కిరణ్, అతని భార్య కిరణ్మయికి అక్కడి నుంచి ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

15న ఎస్టీ ఎంప్లాయీస్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2025 డైరీని ఈ నెల 15న స్థానిక గిరిజన భవన్‌లో ఆవిష్కరించనున్నట్టు ఆ సంఘం నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బడేటి చంటి, జెడ్పీ చైర్‌పర్సన్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జహాన్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

'అభినయ' వార్షికోత్సవాలు ప్రారంభం


ఆత్రేయి దత్తా (ఒడిస్సీ), మహిధర శ్రీ రవళి మనోహరం (కూచిపూడి), శుభదీప్ సర్కార్ (మణిపురి), పద్మిని, ఆంధ్ర నాట్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అభినయ నృత్యభారతి సంస్థ 29వ వార్షికోత్సవాలు ఏలూరు కర్ణభక్తుల సేవా సంక్షేమ సంఘం వారి శ్రీ శలా నాగ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జాతీయ స్థాయి కూచిపూడి, జానపద, బృంద నృత్య పోటీలు, నృత్య కౌముది అవార్డులు, నృత్య తపస్వి అవార్డుల కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నృత్య కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఉదయం పోటీలను కళారత్న, నంది అవార్డు గ్రహీత కేవీ సత్యనారాయణ, గోశాలల రాష్ట్ర సెక్రటరీ మునగాల మురళి కృష్ణ, విజయ లక్ష్మి దంపతులు ప్రారంభించారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా ఆలపాటి నాగేశ్వరరావు, కానాల శ్రీనివాస్, ఎల్ వెంకటేశ్వరరావు, జీఎస్ ప్రసాద్, శానం విజయ మోహన్, సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దువ్వి రామారావు పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు. సబ్ జూనియర్ కూచిపూడి, జానపదం విభాగంలో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం డి.మహేష్ (కథక్, బెంగుళూరు), ఆత్రేయి దత్తా (ఒడిస్సీ, కలకత్తా), మహిధర శ్రీ రవళి మనోహరం (కూచిపూడి, విశాఖపట్టణం), శుభదీప్ సర్కార్ (మణిపురి, కలకత్తా), మోనోజిత్‌సాహా (భరతనాట్యం, కలకత్తా), పి.పద్మిని (ఆంధ్ర నాట్యం, కాకినాడ) ప్రదర్శించి ప్రేక్షకులను అబ్బుర పరిచారు. వీరందరికీ నృత్య కౌముది అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు.

పాలకుల విధానాలతో వ్యవసాయ సంక్షోభం

రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ రంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి పాలకులు నెట్టేస్తున్నారని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఝాన్సీ ఆరోపించారు. స్థానిక అల్లూరు సత్యనారాయణ భవనం (సీఐటీయూ)లో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా అధ్యక్షతన శుక్రవారం రైతు కూలీ సంఘం మహాసభల సావనీరు ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా పాలకులు సరైన వ్యవసాయ విధానాన్ని రూపొందించకపోవడంతో రైతాంగం ఆత్మహత్యలు, సంక్షోభం తీవ్రమవుతుందని ఆరోపించారు. ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున పోరాడితే మూడు చట్టాలను రద్దు చేసి, వాటిని అనేక దొంగ మార్గాల్లో అమలు చేస్తున్నారని వివరించారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్ తరహా వ్యవసాయం పేరుతో మన భూములను విదేశీ కంపెనీలకు, స్వదేశీ బహుళ జాతి సంస్థలకు అప్పగించబోతున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. సభాధ్యక్షుడు షేక్ బాషా మాట్లాడుతూ జూన్ 15,16,17 తేదీల్లో ఏలూరు నిర్వహించిన సంఘం మహాసభల్లో వక్తలు ప్రసంగాలను సావనీరు రూపంలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గం ప్రచురించిందన్నారు. కొల్లేరు ప్రజల వేదిక కన్వీనర్ చింతపల్లి వెంకటనారాయణ సావనీరును ఆవిష్కరించారు. కొల్లేరు ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రముఖ న్యాయవాది పీపీ శాస్త్రి, మానవత స్వచ్ఛంద సంస్థ నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమేష్ కుమార్, రిటైర్డ్ తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరరావు, రైతు కూలీ సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు తదితరులు మాట్లాడారు.

ఎంబీఏ విద్యార్థులకు అపార అవకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎంబీఏ పూర్తి చేసిన వారికి ఐటీ రంగంలో బిజినెస్ ఎనలెటిక్స్, ఈఆర్‌పీ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, బిజినెస్ ఎనలిస్ట్, డెవాప్స్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్ వంటి రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని స్విట్జర్లాండ్ దేశంలో ఈకామ్ ట్రేడింగ్ లిమిటెడ్ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ చల్లా మురళీ కృష్ణ తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు ఐటీ రంగంలో కెరియర్ ప్లానింగ్, అవకాశాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన దేశంలో ఏటా ఆరు లక్షల మంది ఎంబీఏ పూర్తిచేస్తున్నారని, వీరికి విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. రాబోయే ఐదేళ్లలో మన దేశంలో 1.10 కోట్లమందికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆత్మవిశ్వాసం, అంకిత భావంతో నిరంతరం కృషి చేయాలని చల్లా అర్చన విద్యార్థులకు సూచించారు. అనంతరం చల్లా మురళీ కృష్ణ దంపతులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.


మురళీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న సీఆర్ఆర్ ప్రతినిధులు

జీజీహెచ్‌లో సిబ్బంది దందా

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మాతాశిశు విభాగంలో సిబ్బంది పనితీరు అధ్వానంగా మారింది. చిన్నపని చేయాలన్నా చేయి తడపాల్సిందేనని రోగుల బంధువులు వాపోతున్నారు. సొమ్ములు చేతిలో పడితేనే పనిచేస్తామంటూ సిబ్బంది చెప్పటంతో చికిత్స నిమిత్తం వెళ్లే బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఇటీవల ఏలూరు జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ సిబ్బంది తీరులో మార్పు రాలేదు. ఎంసీహెచ్ బ్లాక్‌లో ఒక మహిళ వద్ద డబ్బులు తీసుకున్న అంశంపై రోగి బంధువులు శుక్రవారం ఆందోళన చేశారు. దీంతో కలెక్టర్ వెట్రిసెల్వి విచారణకు ఆదేశించారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి శుక్రవారం ఎంసీహెచ్ బ్లాక్‌లో విచారణ చేశారు. పెదపాడు మండలం కొత్తముప్పర్రుకు చెందిన మహిళ రెండు రోజుల క్రితం ప్రసవించింది. శుభ్రం చేసేందుకు సిబ్బంది రూ.500 అడిగారని బాలింత బంధువు లావణ్య ఆరోపించింది. ఈ మేరకు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టటంతో కలెక్టర్ దృష్టికెళ్లింది. తహసీల్దార్ శేషగిరి మాట్లాడుతూ లంచం తీసుకున్న విషయంపై ప్రాథమికంగా విచారణ చేపట్టామన్నారు. ఈనెల 18న మళ్లీ పూర్తిస్థాయిలో విచారణ చేసి, కలెక్టర్ కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఎరువుల డిపోలపై విజిలెన్స్ దాడి

ఏలూరు టౌన్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారి వి.రాంబాబు ఆదేశాల మేరకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై దాడులు చేస్తున్నట్టు విజిలెన్స్ డీఎస్పీ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు నగరంలోని తుంపాల ఎరువుల డిపోలో నిల్వ ఉన్న రూ.2.80 లక్షల విలువైన 12.25 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని తెలిపారు. తాడేపల్లిగూడెంలో మెస్సర్స్ జ్యోషికా ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.36,93,525 విలువ గల 128 మెట్రిక్‌టన్నుల ఎరువుల నిల్వల్లో వ్యత్యాసం ఉందని, రూ.38,78,320 విలువైన 2039 లీటర్ల అనుమతిలేని బయోస్టిమిలేజ్‌ను సీజ్ చేశామని వివరించారు. పెనుమంత్ర మండలం వెలగలేరు గ్రామంలో మెస్సెర్స్ గ్రంధి రామలింగేశ్వరరావు అండ్ కంపెనీలో రూ.6,72,120 విలువైన 30.55 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామన్నారు. వీటిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ డీఈఈ పి.శ్రీనివాసన్, సీఐ పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్‌కుమార్, విజిలెన్స్ ఏజీ పి.శ్రీధర్, ఏఈ పి.శ్రీనివాసరావు, ఏఈఈ ఎం.రూపేష్‌వర్మ, ఎం అనిల్ బాబు, విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్ తదితరులున్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి


హైందవ శంఖారావం రథాలను ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ ఆలయాల స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే జనవరి 5న గన్నవరంలో హైందవ శంఖారావం పేరిట నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రతి ఒక్క హిందువు పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ కోరారు. శుక్రవారం స్థానిక పాతబస్టాండు సెంటర్‌లోని పాండురంగ స్వామి దేవస్థానం వద్ద హైందవ శంఖారావం సభ ప్రచారానికి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఏర్పాటు చేసిన రెండు ప్రచార రథాలను సత్య రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గారపాటి చౌదరి, హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ కస్తూరి సూర్యప్రకాష్, హైందవ శంఖారావం జిల్లా కో కన్వీనర్ మేడిశెట్టి పాములు, జిల్లా నిధి సేకరణ ప్రముఖ్ కట్నేని కృష్ణ ప్రసాద్, గాది రాంబాబు, పలువురు వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం పోస్టర్, కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ విశ్వహిందూ పరిషత్ ఏలూరు జిల్లాకు చెందిన పలువురు నాయకులు, బీజేపీ నాయకులు శుక్రవారం విడుదల చేశారు.